సాక్షి
ములుగు
మంగళవారం । 3 । జనవరి । 2023



ఇంక్రిమెంట్ల ఇష్యూ..!
అన్‌ఎయిడెడ్ సర్వీస్ కలిగి ఉన్నవారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలనేది హైకోర్టు ఆదేశాలు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి డీఈఓకు ఆదేశాలందాయి. - 8లో▸



ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు..
ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు కాటారం మండల కేంద్రంలోని రోడ్డుపై నిరసన చేపట్టారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0^0 / 19.0^0
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. పొడి వాతావరణం ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వనదేవతలను దర్శించుకున్న కలెక్టర్



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మలను కలెక్టర్ కృష్ణ ఆదిత్య కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావులు డోలు వాయిద్యాలతో గద్దెల పైకి ఆయనకు స్వాగతం పలికారు. సమ్మక్క–సారలమ్మల గద్దెల వద్ద కలెక్టర్ దంపతులు పూజలు నిర్వహించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులను కూడా దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కలెక్టర్‌ను పూజారులు పట్టుకండువాతో సన్మానించి అమ్మవార్ల ప్రసాదం అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ శిడం బాబురావు, ఎండోమెంట్ సూపరిండెంటెంట్ క్రాంతికుమార్, పూజారులు సిద్దబోయిన మునీందర్, కాక సారయ్య, చందా రఘుపతి, దూపవడ్డె నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీటి విడుదల



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రబీ పంట సాగుకు ఐబీ అధికారులు సోమవారం రామప్ప సరస్సు నీటిని విడుదల చేశారు. రైతులు రామప్ప సరస్సు జలాలతో అధికారికంగా 5,150 ఎకరాలకు, అనధికారికంగా మరో 5 వేల ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. రెండు ప్రధాన తూముల నుంచి కాల్వల ద్వారా పంట సాగుకు పూర్తి ఆయకట్టు సాగుకు తైబందీని గతంలోనే నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం రామప్ప సరస్సులో సమృద్ధిగా నీరు ఉండడంతో పూర్తి ఆయకట్టు సాగుకు అవకాశం ఇచ్చారు. వేసవిలో చివరి ఆయకట్టుకు సమస్య లేకుండా ముందస్తుగానే నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రజిత సమ్మయ్య, సర్పంచ్ డోలి రజిత శ్రీనివాస్, ఐబీ డీఈ రవీందర్ రెడ్డి, ఏఈలు మౌనిక, నారాయణస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

'మర్యాద' చేయకుంటే బదిలీనే..

ఏటూరునాగారం: మండల కేంద్రం అయినా మేజర్ గ్రామ పంచాయతీ ఏటూరునాగారంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి రంజిత్ స్థానిక ఎంపీడీఓ కుమార్‌కు సరైన మర్యాద చేయడం లేదని, తనను మంచిగా చూసుకోవడం లేదనే కారణం చేత అతడిని బదిలీ చేసినట్లు పలువురు కార్యదర్శులు వాపోతున్నారు. రంజిత్‌పై కక్ష గట్టి తన విధి నిర్వాహణలో సక్రమంగా పనిచేయడం లేదని ఉన్నతాధికారులకు రిపోర్ట్ ఇచ్చి బదిలీ చేయించినట్లు సమాచారం. ఈ విషయంపై రంజిత్‌ను వివరణ కోరగా తనపై తప్పుడు ఆరోపణలు చేసి బదిలీ చేయించారని, ఎంపీడీఓకు మర్యాదు చేయాలంటే తన వల్ల ఏమి అవుతుందని ప్రశ్నించినందుకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఎంపీఓ కుమార్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేదు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్



ములుగు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి నిర్వహించ తలపెట్టిన ఆందోళనకు తరలివెళ్తున్న వారిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి వెళ్తుండగా ములుగు పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా మంగపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎస్సై తాహెర్‌బాబా ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిధులు అందించకపోవడంతో జీపీల్లో ఆర్థిక సమస్యలు నెలకొంటున్నాయన్నారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేస్తేనే సిబ్బందికి, అభివృద్ధి కార్యక్రమాలకు అండగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండి చాంద్‌పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఆకుతోట చంద్రమౌళి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు దేవ్‌సింగ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ముక్కోటి ఏకాదశి పూజలకు హాజరైన భక్తులు



వైకుంఠ ఏకాదశి పూజలు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. రామప్పలో పూజారులు హరీష్‌శర్మ, ఉమా శంకర్‌లు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. హేమాచల క్షేత్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఏటూరునాగారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలోని ఉత్సవమూర్తులను నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

రామప్ప ఆలయంలో..





హేమాచల క్షేత్రంలో భక్తులు

జీపీలకు పక్కా భవనాలు

జిల్లా వ్యాప్తంగా 37 గ్రామ పంచాయతీలకు మంజూరు
- ఉపాధి హామీ పథకం నుంచి నిధులు
- ఒక్కో భవనానికి రూ.20 లక్షలు

వెంకటాపురం(ఎం): దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు.. గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం అంటూ పరిపాలనా సౌలభ్యాన్ని ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. 2018 ఆగస్టులో 500 జనాభా గల తండాలను, గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె గదుల్లో తాత్కాలికంగా కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని పాలన సాగిస్తున్నారు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేకపోవడంతో సమావేశాల నిర్వహణ, గ్రామసభల ఏర్పాటు, రికార్డుల భద్రత తదితర వాటికి గదులు సరిగా లేక పంచాయతీ అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల గృహాలే గ్రామపంచాయతీ కార్యాలయాలుగా వెలిశాయి. నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించేందుకు ఒక్కొక్క భవనానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేయడంతో ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నూతన భవనాలను నిర్మించనున్నారు.

ఉపాధిహామీ నిధులతో..
జిల్లా వ్యాప్తంగా 174 గ్రామపంచాయతీలు ఉండగా 37జీపీలకు నూతనంగా భవనాలు నిర్మించనున్నారు. ఇందుకోసం గ్రామపంచాయతీకి రూ.20లక్షల చొప్పున మొత్తం రూ.7.40 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలోని వెంకటాపురం(కె) మండలంలో బెస్తగూడెం, బోదాపురం, రాచపల్లి, రాంచంద్రాపురం, వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి, దూలపురం, పెదగొల్లగూడెం, పూసురు, ఏటూరునాగారం మండలంలో అల్లంవారి ఘనపురం, గోవిందరావుపేట మండలంలో గాంధీనగర్, కోటగడ్డ, మచ్చాపూర్, ముత్తాపూర్, రాఘవపట్నం, రంగాపూర్, సోమలగడ్డ, కన్నాయిగూడెం మండల పరిధిలోని కంతనపల్లి, మంగపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, కొత్తూరుమొట్లగూడెం, నర్సాయిగూడెం, పూరేడుపల్లి, రాంచంద్రునిపేట, ములుగు మండల పరిధిలోని బరిగలానిపల్లి, గుర్తూరుతండా, జీవింతరావుపల్లి, కొత్తూరు, ముద్దునూరుతండా, రాంచంద్రాపూర్, తాడ్వాయి మండల పరిధిలోని బందాల, కామారం, రంగాపూర్, వెంగళాపూర్, వెంకటాపురం(ఎం)మండల పరిధిలోని నారాయణగిరిపల్లి, రాజేశ్వర్‌రావుపల్లి, సింగరకుంటపల్లి, తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాలకు నూతనంగా భవనాలు మంజూరు అయ్యాయి.

67జీపీలకు..
జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 174 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతంలో 107 గ్రామపంచాయతీలు ఉండగా 500 జనాభా కలిగిన ప్రతీ తండాను, పల్లెను గ్రామపంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అదనంగా 67 గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. నూతనంగా ఏర్పడిన జీపీలతో పాటు 20కి పైగా పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటితో పాటు నూతనంగా ఏర్పడిన 67 జీపీలకు పక్కా భవనాలు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం 37 పంచాయతీలకే భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా పక్కా భవనాలు మంజూరు కాని సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న లక్ష్మీపురం నూతన పంచాయతీ



వెల్తుర్లపల్లి అద్దె భవనంలో జీపీ కార్యాలయం



లింగాపూర్‌లో అద్దె భవనంలో..

నూతన భవనాల మంజూరు హర్షణీయం



పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం 500 జనాభా గల ప్రతి తండాను, పల్లెలను జీపీలుగా ఏర్పాటు చేసింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు గ్రామపంచాయతీల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. అరకొర వసతులతో అద్దె భవనంలో కొనసాగుతున్న పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షించదగిన విషయం.

- మేడబోయిన అశోక్,
సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు, వెంకటాపురం(ఎం)

పక్కా భవనాలు నిర్మించాలి



జిల్లాలో సగానికి పైగా గ్రామపంచాయతీలలో సరైన సౌకర్యాలు లేవు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకుని పరిపాలన ఇబ్బందిగా మారుతోంది. అద్దె భవనాల్లో అనేక గ్రామపంచాయతీలు కొనసాగుతుండగా కేవలం 37 గ్రామపంచాయతీలకే నూతన భవనాలను మంజూరు చేశారు. శిథిలావస్థలో ఉన్న జీపీలతో పాటు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రతీ పంచాయతీకి పక్కా భవనం మంజూరు చేయాలి.

- చెన్నోజు సూర్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్

పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య



చుంచుపల్లిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతూ..

కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ములుగు: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన లోటుపాట్లను సరిచేసుకోవాలన్నారు. మూడు రోజుల్లో అవెన్యూ ప్లాంటేషన్ల పనులు పూర్తి చేయాలన్నారు. మొక్కలు చనిపోకుండా ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేసి పశువుల నుంచి కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల కాపర్లతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. వరదల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో నష్టపోయిన రైతుల వివరాలను అందించాలన్నారు. ఈ– హెల్త్ ప్రొఫైల్‌లో భాగంగా బీపీ, షుగర్ తేలిన వారికి తిరిగి పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. పీహెచ్‌సీల్లో సెల్ కౌంటర్స్ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వైవీ. గణేశ్, డీఎస్ఓ అరవింద్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
మంగపేట: మండల పరిధిలోని చుంచుపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ నిర్వహణ రికార్డులు, సిబ్బంది వివరాలు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వైద్యాధికారి, సిబ్బంది ప్రతిరోజూ సమయ పాలన పాటించాలని, విధిగా ములుగు వెలుగు యాప్‌లో హాజరు వేయాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలిస్తూ రక్త పరీక్షలు, మందులు, స్టాక్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర మందులను ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ బీపీ టెస్టు చేయించుకున్నారు. నూతనంగా వైద్యాధికారిగా రిపోర్టు చేసిన యమునను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఫార్మసిస్టు హిమకిరణ్, స్టాఫ్‌నర్స్ రేవతి, ల్యాబ్ టెక్నీషియన్ పాపారావు, హెల్త్ సూపర్‌వైజర్ ముత్తమ్మ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్యను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురు అధికారులకు తినిపించారు. అనంతరం కలెక్టర్‌కు అధికారులు తినిపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అదనపు కలెక్టర్ వైవీ గణేశ్, డీఆర్ఓ కూతాటి రమాదేవి, జెడ్పీసీఈఓ ప్రసూనారాణి, డీఆర్డీఓ నాగ పద్మజ, డీపీఓ కొండా వెంకయ్య, డీఎంహెచ్ఓ అప్పయ్య, సీపీఓ ప్రకాశ్, డీసీఓ సర్దార్‌సింగ్ తదితరులు ఉన్నారు.



డీఎంహెచ్ఓకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభం

ములుగు: జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన న్యాయ సేవాధికార సంస్థను హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సోమవారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పీవీపీ లలిత శివజ్యోతి, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి మాధవి, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రామ్మోహన్‌రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సౌఖ్య, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి కొండి రవీందర్, కోశాధికారి బానోత్ స్వామిదాస్, ఏపీపీ పావని, న్యాయవాదులు నర్సిరెడ్డి, వినయ్‌కుమార్, సీహెచ్ వేణుగోపాల చారి, జూనియర్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద జడ్జి లలిత శివజ్యోతి

డాటా ఎంట్రీపై అవగాహన ఉండాలి

ములుగు: డాటా ఎంట్రీపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం డాటా ఎంట్రీ ఆపరేటర్స్‌కు కంటి వెలుగు కార్యక్రమంపై శిక్షణ ఇవ్వగా డీఎంహెచ్ఓ అప్పయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని డాటా ఎంట్రీ ఆపరేటర్స్ విజయవంతం చేయాలని, శిక్షణలో అన్ని విషయాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. పేషెంట్ల వివరాలను కంటి వెలుగు యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. టెక్నికల్ సమస్యలుంటే డాటా మేనేజర్ ప్రవీణ్‌కు తెలియజేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండవసారి చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని లబ్ధిదారులకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం సరిత, రాజన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

అధికారంలోకి రావడమే లక్ష్యం

వెంకటాపురం(ఎం): సబ్బండ కులాలు అధికారంలోకి రావడమే 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర లక్ష్యమని దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ అన్నారు. మండల పరిధిలోని కేశవపురం, నర్సాపూర్ గ్రామాల మీదుగా పాదయాత్ర సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన డీఎస్పీ జెండాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అగ్రకులాల రాజ్యాన్ని కూలదోసి అణగారిన వర్గాల రాజ్యం స్థాపిస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు పరిపాలకులు అవ్వడమే అంబేద్కర్ ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమేష్, నాయకులు లక్ష్మణ్, సాంబశివన్, రవీందర్, జయలక్ష్మి, భద్రయ్య, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కేశవపురంలో జెండా ఆవిష్కరిస్తున్న విశారదన్

వినతులను నిర్లక్ష్యం చేయొద్దు

అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్

ములుగు: ప్రజావాణిలో వచ్చిన వినతులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 27 దరఖాస్తులు రాగా వాటిలో 12 భూ సమస్యలు, వృద్ధాప్య పింఛన్లు, స్వయం ఉపాధి వంటివి ఉండగా మిగితా 15వినతులు తదితర సమస్యలపై ఉన్నాయి. ఈ దరఖాస్తులను డీఆర్ఓ రమాదేవితో కలిసి అదనపు కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖలకు సిఫారస్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రసూనా రాణి, సీపీఓ ప్రకాశ్, డీఎంహెచ్ఓ అప్పయ్య, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ రవి, డీఏఓ గౌస్ హైదర్, డీఎస్ఓ అరవింద్‌రెడ్డి, జిల్లా మేనేజర్ శ్రీరాములు, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో..
ఏటూరునాగారం: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి పీఓ వినతులను స్వీకరించారు. మంగపేట మండలం శనిగకుంటలో వంద గిరిజన రైతులు కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూములను చదును చేసి సాగులోకి తీసుకురావాలని రైతులు తొలెం నర్సింహరావు, వెంకన్న, వెంకటయ్యలు కోరారు. కోవిడ్–19 వల్ల బ్లాక్ ఫంగస్ వచ్చి పక్షవాతంతో వికలాంగుడిని అయ్యానని తనకు జీవనోపాధి చూపించాలని వెంకటాపురం(ఎం) నర్సింగాపురం గ్రామానికి చెందిన గొస్కుల రజినీకుమార్ పీఓను వేడుకున్నారు. ట్రాక్టర్, ట్రాలీ ఐటీడీఏ ద్వారా ఇప్పించాలని రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నానని వెంకటాపురం(కె) మల్లాపురం గ్రామానికి చెందిన మడకం చందర్‌రావు తెలిపారు. ఏటూరునాగారంలోని ఐటీడీఏ గార్డెన్‌కు ఉన్న స్థలాన్ని కబ్జా చేస్తున్నారని చుట్టూ పెన్సింగ్ వేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ పీఓను కోరారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన 12 దరఖాస్తులను పరిశీలించి వారికి సత్వర న్యాయం చేస్తామని పీఓ తెలిపారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీఓ

ప్రమాద రహిత ఉత్పత్తి చేయాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదరహిత బొగ్గు ఉత్పత్తి చేయాలని రామగుండం రీజియన్ డీజీఎం ఏకే శర్మ సూచించారు. ఏరియాలోని కేటీకే 1వ గని ఆవరణలో సోమవారం ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటుచేయగా రక్షణ గురించి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఆరేళ్ల తర్వాత మైనార్టీలకు రుణయోగం

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

యువతలో అవగాహన పెంచడమే ధ్యేయం

గృహ నిర్మాణ రుణం పెంపు

- వివరాలు 10లో▸

నర్సింగ్‌లో విదేశీ ఉద్యోగ శిక్షణ, నియామకాలు

హన్మకొండ అర్బన్/కాశోజీ సెంటర్: జపాన్‌లో పని చేసేందుకు అర్హులైన నర్సింగ్ సిబ్బందికి శిక్షణతోపాటు నియామకాలు చేపట్టనున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉపాధి కల్పన అధికారులు మల్లయ్య, ఎస్.మాధవి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 4 నుంచి వరంగల్ కేఎంసీలోని నర్సింగ్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నమోదిత కళాశాలలు, సంస్థల నుంచి బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్ఎం డిప్లొమా హోల్డర్లు ఈప్రోగ్రామ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 22 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు ఈనెల 4న ఉదయం 10 గంటల్లోపు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన వారికి జపనీస్ భాష, ఆదేశంలో నర్సింగ్ డ్యూటీకి సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తైన అభ్యర్థులకు నెలకు రూ.1.20 నుంచి రూ.1.50 లక్షల వేతనం ఉంటుందని తెలపారు. అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి టామ్ కామ్ హెచ్ఆర్ మేనేజర్లు 9100798204, 9908830438 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు టామ్ కామ్.తెలంగాణ.జీవోవీ.ఇన్ సందర్శించాలని లేదా టామ్ కామ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని వారు సూచించారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

గీసుకొండ : మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన సాయిలి హారిక కనిపించడం లేదని ఆమె తండ్రి సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన హారిక తిరిగి రాలేదని పేర్కొన్నాడు. నర్సంపేట బిట్స్ కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోందని, విశ్వనాథపురం గ్రామానికి చెందిన దూల జ్యోతిబోస్ అనే డ్రైవర్‌తో వెళ్లినట్టు అనుమానంగా ఉందని ఫిర్యాదులో వివరించాడు. తన కూతురు ఆచూకీ గుర్తించి న్యాయం చేయాలని కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు తెలిపారు.

అన్‌ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్ల ఇష్యూ..!

హనుమకొండ జిల్లా విద్యాశాఖలో వివాదం

- కొందరు అనర్హులున్నారంటూ ఆరోపణలు, బిల్లుల నిలిపివేత
- లోకల్ ఫండ్ ఆడిట్‌కు పంపిస్తాం : డీఈఓ అబ్దుల్‌హై



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద అన్‌ఎయిడ్ సర్వీస్ కలిగి ఉన్నవారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలనేది హైకోర్టు ఆదేశాలు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి డీఈఓకు ఆదేశాలు అందాయి. ఇంక్రిమెంట్లు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించగా.. అనర్హులు సైతం దరఖాస్తు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈప్రక్రియలో ఓ ఉపాధ్యాయుడు చక్రం తిప్పాడన్న ఆరోపణల మేర కు బిల్లులను నిలిపివేశారు. ఇంక్రిమెంట్లు ఇచ్చేందుకు జిల్లాలో గతంలో అన్ ఎయిడెడ్ సర్వీస్ కింద పని చేసి తరువాత ఎయిడెడ్ సర్వీస్‌లోకి వచ్చిన వారు దరఖాస్తులు, సర్వీస్ బుక్స్‌ను డీఈఓ కార్యాలయంలో సమర్పించారు. ఇలా సుమారు 50 మందికిపైగా ఉన్నారు. అందులో కొందరు ప్రస్తుతం పనిచేస్తున్నవారు, రిటైర్డ్ అయినవారున్నారు. ఆయా ఉపాధ్యాయులు ఎన్నేళ్లపాటు అన్ ఎయిడ్ సర్వీస్‌ను కలిగి ఉన్నారనేది సర్వీస్ బుక్స్‌ను ఒక్కొక్కరివి పరిశీలించి అర్హత ఉన్న వారికి డీఈఓ ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సింటుంది. ఆ తర్వాత ప్రొసీడింగ్స్‌తోపాటు బిల్లులు డీటీఓలో సమర్పిస్తే వారికి సర్వీస్‌ను బట్టి ఇంక్రిమెంట్ల కింద డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. సర్వీస్‌ను బట్టి ఇచ్చే ఇంక్రిమెంట్లతోపాటు వేతనాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు. హనుమకొండ ఇన్‌చార్జ్ డీఈఓగా వాసంతి ఉన్నప్పుడు ఈ ఇంక్రిమెంట్ల విషయంలో వారి సర్వీస్‌బుక్స్ (ఎస్‌బీ)ను పరిశీలించేందుకు ఓ కమిటీని నియమించారు. అందులో ఇద్దరు పీజీహెచ్‌ఎంలు, ఉర్దూ మీడియం స్కూల్ ఉపాధ్యాయుడు ఉన్నారు. ఆ కమిటీ పరిశీలన చేసి డీఈఓకు సమర్పించింది.

అనర్హులకు కూడా అవకాశమంటూ ఆరోపణలు?

జిల్లాలో రెండు దశాబ్దాలు, అంతకుముందు కూడా ఎయిడెడ్ పాఠశాలల్లో నియామకం అయినవారిలో కొందరు కొంతకాలంపాటు అన్ ఎయిడ్ సర్వీస్ చేశాక ఎయిడెడ్ గ్రాంటులో నియామకమైన వారు ఉన్నారు. అన్ ఎయిడెడ్ సర్వీస్ కలిగినవారికి అప్పట్లో డీఈఓ కూడా ర్యాటిఫికేషన్ నియామకం ఉత్తర్వులు ఉండాల్సి ఉంటుంది. నియమ నిబంధనల ప్రకారం అన్ ఎయిడ్ సర్వీస్ ఉన్నవారికి ఇంక్రిమెంట్లు ఇస్తున్నారని తెలియడంతో కొందరు తమ సర్వీస్ బుక్స్‌లలో అన్ ఎయిడ్ సర్వీస్‌ను కూడా చేసినట్లు మార్పులు చేశారనేది ఆరోపణలు వస్తున్నాయి. అందుకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చక్రం తిప్పుతూ చేతివాటం ప్రదర్శించారని సమాచారం. డీఈఓ కార్యాలయంలో ఎయిడెడ్ ఉపాధ్యాయుల బిల్లులు చేయడంలోనూ అతడికి అనుభవం ఉంది. దీంతో ఆయన చేతివాటం ప్రదర్శించి కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసి రిటైర్డ్ అయిన ఓ ఉపాధ్యాయుడు డిగ్రీతోనే 1985లోనే నియామకం అయి కొన్నేళ్లు అన్ ఎయిడెడ్ సర్వీస్ చేశారు. ఆ తర్వాత టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి ఎయిడెడ్ సర్వీస్ చేసి ఉద్యోగ విరమణ పొందారు. అతను కూడా అన్ ఎయిడ్ ఇంక్రిమెంట్ కోసం దరఖాస్తు చేస్తే సర్వీస్‌బుక్‌ను పరిశీలించి డిగ్రీతోనే అన్ ఎయిడ్ సర్వీస్ చేశావు కాబట్టి ఆ కాలానికి ఇంక్రిమెంట్లు రావని చెప్పారు. దీంతో ఆ రిటైర్డ్ ఉపాధ్యాయుడు విషయాన్ని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై దృష్టికి తీసుకెళ్లారు. అనర్హులకు కూడా ఇచ్చేందుకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చక్రం తిప్పుతున్నారని కూడా మౌఖికంగా చెప్పుకొచ్చాడు. దీంతో కొద్దిరోజుల క్రితమే ఆ ఉపాధ్యాయుడిని డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించవద్దని చెప్పి పాఠశాల విధులకు పంపినట్లు సమాచారం.

గతంలో ఇంక్రిమెంట్లు పొందాక రికవరీ



ఉమ్మడి రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలో అన్ ఎయిడ్ సర్వీస్ చేసిన వారికి 2003లో సర్వీస్ ఇంక్రిమెంట్లు ఇచ్చారు. 2005లో అప్పటి ప్రభుత్వం వాటిని రద్దు చేసి ఆ ఇంక్రిమెంట్లు పొందిన ఉపాధ్యాయుల నుంచి రికవరీ చేసింది. ఆతర్వాత పరిణామ క్రమంలో వ్యక్తిగతంగా ఎంతో మంది అన్ ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్ల కోసం కోర్టులను ఆశ్రయించారు. ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కొంతకాలం క్రితమే కోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేయలేదు. దీంతో ఉపాధ్యాయులు కోర్టు ధిక్కరణ కేసులు వేశారు. దీంతో చివరికి ఇటీవల దీన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపక్రమించారు. హనుమకొండ జిల్లాలో ఇచ్చేందుకు ఉపక్రమించగా పలు ఆరోపణలతో ఆ బిల్లులను నిలిపివేశారు.

లోకల్ ఫండ్‌కు పంపిస్తాం..

ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద అన్‌ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలనేది హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అమలు చేస్తాం. అన్‌ఎయిడెడ్ సర్వీస్‌కు డీఈఓ ర్యాటిఫికేషన్ నియామకం ఆర్డర్ ఉండాలనేది ఇప్పుడు పలువురు చెబుతున్నారు. ఆయా ఉపాధ్యాయుల బిల్లుల ఎస్‌బీలు లోకల్ ఫండ్ ఆడిట్ అధికారులకు పంపిస్తాం. వారు పరిశీలించిన తరువాతే ఇంక్రిమెంట్లు మంజూరు చేస్తాం. అవసరమైతే కలెక్టర్‌కు నివేదించాక వారి ఆదేశాల ప్రకారం అమలు చేస్తాం.

- అబ్దుల్ హై, డీఈఓ, హనుమకొండ

ఇసుక ట్రాక్టర్ బోల్తా

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ గ్రామ శివారులో అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తా పడ్డ ఘటన సోమవారం చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గుర్తించి డ్రైవర్ పక్కకు దూకడంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. పోలీసులు విచారణ చేపట్టి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇద్దరి అరెస్ట్

కాజీపేట : సెలూన్ షాపు ఓనర్‌పై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హనుమకొండ నయింనగర్‌లో డిసెంబర్ 30న ఇద్దరు వ్యక్తులు సెలూన్ షాప్‌కు వచ్చి హేయిర్ కటింగ్ చేయాలని కోరారు. వీలు కాదని షాపు యజమాని రంజిత్ చెప్పడంతో అతడిపై దాడి చేసి గాయపర్చారు. నిందితులను సీసీ కెమెరాల ఆధారంగా ఖాదర్ పాషా, బస్కే అఖిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు...

- రోడ్డెక్కిన గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు

కాటారం : ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ తీవ్ర చలిలోనూ గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు మండల కేంద్రంలోని రోడ్డుపై సోమవారం నిరసన చేపట్టారు. 'ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు.. వెంటనే బదిలీ చేయండి'.. అని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పలు పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలపడంతో సుమారు గంటపాటు అలజడి నెలకొంది. ప్రిన్సిపాల్ చైతన్య తమకు స్వేచ్ఛ నివ్వడం లేదని, తమ తల్లిదండ్రులను అగౌరవపర్చుతూ గంటల తరబడి గేటు వద్దనే నిలబెడుతోందని విద్యార్థినులు వాపోయారు. అస్వస్థతకు గురైతే చికిత్స కోసం కాలినడకన తీసుకెళ్తున్నారని, పాఠశాలలోనే బంధించినంత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌ను బదిలీ చేసే వరకు దలబోమని భీష్మించారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎస్సై శ్రీనివాస్ అక్కడకు చేరుకుని విద్యార్థినులకు సర్దిచెప్పారు. ప్రిన్సిపాల్ చైతన్యతో ఎస్సై ఫోన్‌లో సమస్యలపై మాట్లాడారు. సమస్యను ఎంపీపీ సమ్మయ్య ఫోన్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేపట్టి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలపడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.

ఆర్సీఓ విచారణ..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి సోమవారం విచారణ చేపట్టారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థినులు సమస్యలను ఆర్సీఓకు వివరించారు. విచారణ వివరాల నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్సీఓ తెలిపారు. బాలల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థినులకు కౌన్సిలింగ్ చేశారు. సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సమితి సభ్యులు విద్యార్థినులకు సూచించారు.

భూ తగాదా.. వ్యక్తిపై హత్యాయత్నం



దాడిలో గాయపడ్డ బోనగిరి యాకస్వామి

దేవరుప్పుల : భూతగాద విషయంలో తమకు మద్దతు ఇవ్వడం లేదనే కారణంతో ఓ వ్యక్తిపై దాయాదులు హత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కోలుకొండలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మునావత్ రమేశ్ నాయక్ కథనం ప్రకారం.. కోలుకొండకు చెందిన గనుపాక స్వామి ప్లాట్ తగాదా కొనసాగుతోంది. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ డైరెక్టర్ బోనగిరి యాకస్వామి దాయాదులైన బోనగిరి మురళి, సోమరాజు, శివప్రసాద్‌లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మురళి ఫోన్ చేసి గ్రామ సమీపంలోని యాకస్వామి కోళ్లఫామ్ వద్దకు ఇద్దరితో కలిసి వెళ్లి తగాద విషయమై మద్యం సేవిస్తూ వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనే సోమరాజు, మురళి బాటిళ్లు పగులగొట్టి దాడికి పాల్పడి గాయపర్చారు. బాధితుడు కేకలు వేయడంతో ముగ్గురు పరారయ్యారు. యాకస్వామి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై మంగళవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పల్లె కన్నీరు పెట్టింది..

- 'కురవి' మృతుడు నవీన్ అంత్యక్రియలు



నవీన్ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చిన్నగూడూరు : మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్ర శివారులో చోటు చేసుకున్న భారీ ప్రమాదంలో మృతి చెందిన డొంకన నవీన్ అంత్యక్రియల్లో గ్రామం శోకసంద్రంలో మునిగింది. మండలంలోని మంగోరిగూడెంలో నవీన్ అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. శనివారం రాత్రి ప్రమాదం చోటు చేసుకుని నవీన్ మృతి చెందిన విషయం తెలిసిందే. అదే ప్రమాదంలో మృతి చెందిన సుమన్, శ్రీకాంత్‌ల అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. నవీన్ తల్లి బతుకుదెరువు కోసం సూరత్‌కు వెళ్లి అక్కడే ఉంటుండగా ఆమె రాక కోసం నవీన్ మృతదేహాన్ని సోమవారం వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా ఉంచారు. ఈ క్రమంలో గ్రామానికి చేరుకున్న నవీన్ తల్లి, భార్య కన్నీరు మున్నీరుగా విలపించారు. చేతికందిన కొడుకు చనిపోయాడంటూ నవీన్ తల్లి గుండెలు అవిసేలా విలపించడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. మూడేళ్ల వయస్సున్న చిన్న పిల్లలను ఎలా సాకాలంటూ నవీన్ సతీమణి కన్నీరు మున్నీరైంది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడవెల్లి రాజవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచంద్రరావు మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మరిపెడ సీఐ సాగర్, ఎస్సైలు రవికుమార్, పవన్‌కుమార్, నరేశ్ బందోబస్తు నిర్వహించారు.

రైలులో ప్రయాణికుడి మృతి

- సుమారు 1.20 గంటలపాటు నిలిచిన వైనం
- యాత్రికులకు ఇబ్బందులు



భగీరథ విశ్వాస్ మృతదేహం




మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు



మృతుడి భార్య సునిత విశ్వాస్

డోర్నకల్ : కన్యాకుమారి నుంచి కోర్బా వెళ్తున్న ప్రత్యేక రైలులో అనారోగ్యంతో ఓ ప్రయాణికుడు సోమవారం మృతి చెందాడు. సుమారు 1.20 గంటలపాటు రైలును డోర్నకల్‌లోనే నిలిపేశారు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. డిసెంబర్ 24న దక్షిణ భారత యాత్ర కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్బా స్టేషన్ నుంచి ఐఆర్‌టీసీ ప్రత్యేక యాత్రా రైలు బయల్దేరింది. తిరుపతి, కన్యాకుమారి తదితర పుణ్యక్షేత్రాల సందర్శన అనంతరం రైలు కోర్బాకు వెళ్తుండగా ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విజయవాడ సమీపంలో రైలులో ఎస్-3 బోగీలో ప్రయాణిస్తున్న కోర్బాకు చెందిన భగీరథ విశ్వాస్ (79) తీవ్ర అస్వస్థతకు గురై టాయిలెట్‌లో పడిపోయాడు. భర్త పడిపోవడాన్ని గమనించిన భార్య సునిత విశ్వాస్ ఇతర ప్రయాణికుల సహాయంతో బెర్త్‌పైకి చేర్చింది. రైలు డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు సోమవారం ఉదయం 8.10 గంటలకు చేరుకున్న తర్వాత 108 సిబ్బంది భగీరథ విశ్వాస్‌ను పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ప్రసాద్‌తోపాటు జీఆర్పీ, ఆర్పీఎఫ్, కమర్షియల్ సిబ్బంది బోగీ వద్దకు చేరుకుని పరిస్థితిని ఉన్నతాధికారులు వివరించారు. అధికారుల ఆదేశాల మేరకు భగీరథ విశ్వాస్ మృతదేహాన్ని రైలింజన్ వెనుక ఉన్న బ్రేక్ బోగీలోని చేర్చారు. కాగా స్ట్రెచర్ లేకపోవడంతో పోలీసులు చివర నుంచి మూడో బోగీలో ఉన్న మృతదేహాన్ని ఇంజన్ వెనుక ఉన్న బ్రేక్ బోగీలోకి చేర్చేందుకు సుమారు ముప్పావు కిలోమీటర్ దూరం మోసుకుంటూ తీసుకెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 1.20 గంటలపాటు రైలు డోర్నకల్‌లో నిలిచిపోవడంతో యాత్రకు బయల్దేరిన ప్రయాణికులు ఇబ్బంది పడడం కనిపించింది.


రోడ్డు ప్రమాదంలో రైతు..



సోమయ్య (ఫైల్)

తొర్రూరు : రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు డివిజన్ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై పిల్లల రాజు కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలంలోని రామారం గ్రామ శివారులోని ఆరెగూడెంకు చెందిన రైతు మార్త సోమయ్య(42) ద్విచక్ర వాహనంపై తొర్రూరుకు వచ్చి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య స్వరూప, కుమారుడు ఉదయ్, కుమార్తె చిక్కీ ఉన్నారు. సోమయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఆసుపత్రికి పంపించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



మృతి చెందిన చందర్

కమలాపూర్ : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని పూరిగుట్ట తండాకు చెందిన మాలోతు చందర్ (50) కమలాపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు గత నెల 27న చందర్ ఇంట్లోంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మృతుడికి ఫిట్స్ ఉందని, అతిగా మద్యం సేవించి తాగునీరు దొరక్క మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, ఐదుగురు కూతుర్లున్నారు. చందర్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గాయపడిన మహిళ..

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదం గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లాలోని నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. చంద్రయ్యపల్లికి చెందిన భాషబోయిన మానస (23) భర్త రజనీకాంత్, రెండేళ్ల వయస్సున్న కొడుకుతో కలిసి ద్విచక్ర వాహనం మీద డిసెంబర్ 31న హన్మకొండకు వెళ్తుండగా నల్లబెల్లి మండల కేంద్రంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో మానసకు తీవ్ర గాయాలు కాగా ఆమెను స్థానికులు 108లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మానస చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది.

చికిత్స పొందుతున్న యువకుడు..

కాటారం : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన భూపాలపల్లి జయశంకర్ జిల్లా పరిధిలోని కాటారం మండలంలోని గంగారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. గంగారానికి చెందిన లావుడ్యా రాజునాయక్ (35) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాజునాయక్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాజునాయక్ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. రాజునాయక్ మద్యం మత్తులో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లున్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు





స్కూటీతో సహా లారీ కింద ఇరుక్కుని మృతి చెందిన సంపత్‌రావు



ఘటనా స్థలిలో రోదిస్తున్న బంధువులు





ప్రమాదంలో గాయపడిన మహిళలు

కమలాపూర్ : హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని టేకుమట్ల మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బిక్కినేని సంపత్‌రావు (53) భార్య విజయతో కలిసి కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో బంధువుల ఇంట్లో జరిగిన దశదినకర్మకు స్కూటీపై వచ్చి తిరిగి వెళ్తుండగా ఉప్పల్‌లోని భీంపల్లి, కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హుజూరాబాద్ వైపు నుంచి కమలాపూర్ దిశగా వెళ్తున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొట్టింది. లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఎమ్మార్పీఎస్ జెండా గద్దెతోపాటు స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంపత్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య విజయ, అక్కడే బస్సు కోసం వేచి ఉన్న కన్నూరుకు చెందిన సుమలత తీవ్ర గాయాల పాలయ్యారు. అలాగే అక్కడే తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటున్న అంజలికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడ్డ మహిళలిద్దరినీ 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. సంపత్‌రావు మృతి చెందిన విషయం తెలిసి అతడి బంధువులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై పడుకుని, బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఉప్పల్-కమలాపూర్ మార్గంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. మృతుడి కూతురు శైలజ స్పృహ కోల్పోగా ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కమలాపూర్, హసన్‌పర్తి, ఎల్కతుర్తి సీఐలు సంజీవ్, నరేందర్, శ్రీనివాస్, ఎస్సైలు సతీశ్, పరమేశ్, విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పగా సుమారు 5 గంటల అనంతరం ఆందోళన విరమించారు.

'గెల్లు' పరామర్శ

మృతుడు సంపత్‌రావు కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిన వెంటనే ఆయన ఉప్పల్‌కు చేరుకున్నారు. మృతుడి కుటుంబాన్ని, బంధువులను పరామర్శించారు. వైద్యులకు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

కూలీల జాతర..

మిర్చి తోటల్లో పని కోసం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మూటా ముళ్లెలతో కూలీలు డోర్నకల్‌లో రైలు దిగుతుండడం జాతరను తలపించింది.

- డోర్నకల్

